క్లుప్తంగా

ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్



మామిడివాడలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మామిడివాడ, పంచదార్ల, రాజుకోడూరు, హరిపురం, వెల్చూరు సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. దీంతో ఈ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



తిమ్మరాజుపేటలో పైప్‌లైన్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ జగన్

మునగపాక: తిమ్మరాజుపేటలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ అన్నారు. తిమ్మరాజుపేటలో జరుగుతున్న పైప్‌లైన్ మరమ్మతు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి దృష్టికి తీసుకురావాలన్నారు.

పథకాల అమలుపై నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి చాముండేశ్వర్రావు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, పథకాల అమలుపై నిర్లక్ష్యం చూపవద్దని మండల ప్రత్యేకాధికారి టి.చాముండేశ్వర్రావు స్పష్టం చేశారు. ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత శనివారం ఆయన తొలిసారిగా స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సంక్షేమ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు అందుతున్న వివిధ రకాల సేవలు, సంక్షేమ పథకాల అమలు, జల్ జీవన్ మిషన్ పనులు, బలహీనవర్గాల గృహ నిర్మాణం, కొత్తగా చేపట్టబోయే కులగణన తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. అనంతరం కొమ్మాయి గుండం చెరువు పక్కనున్న వార్డు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, సూపరింటెండెంట్ ప్రసాద్, తహసీల్దార్ రాణి అమ్మాజీ పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు సర్వే

- బీఎల్‌వోలతో తహసీల్దార్ సమీక్ష



బీఎల్‌వోలతో సమీక్ష చేస్తున్న తహసీల్దారు జానకమ్మ

కోటవురట్ల : బీఎల్‌వోలు సకాలంలో సర్వే జాబితాలను అప్పగించాలని తహసీల్దారు జానకమ్మ ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. తహసీల్దారు మాట్లాడుతూ ఓటరు జాబితా పక్కా సమాచారంతో పారదర్శకంగా ఉండాలన్నారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. సర్వేలో ఇంటి నంబర్లు తప్పుగా ఉంటే ఫారం 8 ద్వారా సరిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాధరావు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



కోటవురట్లలో ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఈటీలు



రాంబిల్లిలో వలంటీర్లకు శిక్షణ

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం..ఆంధ్ర'



పాయకరావుపేట ఉన్నత పాఠశాలలో వాలీబాల్ ఆటలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



క్రీడాపోటీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం

కోటవురట్ల : ఆడుదాం ఆంధ్రా.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై పీడీలు, వలంటీర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను గుర్తించి ఉజ్వల భవిష్యత్‌ను ఇచ్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల ద్వారా యువతకు మంచి భవిష్యత్‌ను ఇచ్చేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. యువతలోని క్రీడానైపుణ్యం ప్రదర్శించేందుకు ఇది మంచి వేదిక అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖోఖో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయన్నారు.

15 ఏళ్లు పైబడిన వారంతా అర్హులే...

ఎస్.రాయవరం: క్రీడలు పట్ల ఆసక్తి కనబరచే వారు మానసిక ఆనందాన్ని పొందుతారని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో శనివారం ఆడుదాం ఆంధ్ర అనే క్రీడల నిర్వహణకు సంబంధించి సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే నెలలో గ్రామాల్లో సచివాలయాలు వారీగా నిర్వహించే పోటీలకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ముందుగా సచివాలయ స్థాయిలో పోటీలు నిర్వహించి, ఆ తరువాత విజేతలతో మండల స్థాయి పోటీలు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజేతలు క్రీడల్లో పోటీ పడవచ్చన్నారు. ఈ క్రీడల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ ఉంటాయన్నారు. గ్రామంలో 15 ఏళ్లు పైబడిన యువకులు, పెద్దలు ఎవరైనా ఈ క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలవవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత ఈడీలు, పీఈటీలు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

రాంబిల్లి: ఆడుదాం ఆంధ్ర.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు అన్నారు. రాంబిల్లి ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయిలో వలంటీర్లకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడాకారులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సూర్యారావు, సూర్యనారాయణ, పలువురు ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అవగాహన కార్యక్రమం

పాయకరావుపేట : వచ్చే నెల 15 నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు శనివారం ఆయా పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో మండలంలో గల ఎస్.నర్సాపురం, పాల్తేరు, మంగవరం, పాయకరావుపేట ఉన్నత పాఠశాలల్లో క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆటల పోటీలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో గ్రామ వలంటీర్లకు క్రీడా పోటీలకు అనుసరించవలసిన విధి విధానాలను తెలియజేశారు.

భూ సర్వే త్వరగా పూర్తి చేయండి

- పనిచేయలేని అధికారులు సెలవు పెట్టండి
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు




సమావేశంలో పాల్గొన్న సభ్యులు



పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో భూ సర్వేను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అచ్యుతాపురంలో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందని, దానిని నివారించడానికి సంబంధిత శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. జగనన్న సురక్షలో భాగంగా అందరికీ అవరమైన ధ్రువీకరణ పత్రాలను ఇవ్వగలిగామని, జగనన్న ఆరోగ్య సురక్షలో 28 వేల మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, మడుతూరు సర్పంచ్ మోటూరు సంజీవి పలు అంశాలపై అధికారులను ప్రశ్నించారు. పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని తమ గ్రామానికి అవసరమైన వనరుల గురించి అడిగారు. దొప్పెర్ల సర్పంచ్ చిన్నారావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొనగా, నాలుగు పంచాయతీలు చూస్తున్న సదరు కార్యదర్శిని రెండు పంచాయతీలకు పరిమితం చేసి, మరొకరికి బాధ్యతలు అప్పగించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారిపై ఎమ్మెల్యే మండిపడ్డారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీడీవో విజయలక్ష్మి, కోఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత సీఈవో రామకృష్ణంరాజు మృతి



రామకృష్ణంరాజు(ఫైల్)

కోటవురట్ల: స్థానిక పీఏసీఎస్ విశ్రాంత సీఈవో భూపతిరాజు రామకృష్ణంరాజు (64) శనివారం హఠాన్మరణం చెందారు. రామకృష్ణంరాజు రెండేళ్ల క్రితం సొసైటీలో సీఈవోగా చేస్తూ పదవీ విరమణ పొందారు. సొసైటీ సభ్యులతో సత్సంబంధాలు కలిగిన రామకృష్ణంరాజు తాత్కాలికంగా తన సేవలు కొనసాగిస్తున్నారు. పీఏసీఎస్ సహకార వారోత్సవాల నిర్వహణకు శనివారం ఏర్పాట్లు చేస్తుండగా ఒక్కసారిగా కుర్చీలో కూలబడిపోయారు. వెంటనే అక్కడే ఉన్న మాజీ డీసీసీబీ చైర్మన్ ఆర్.ఎస్ రామచంద్రరాజు, రైతులు హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందినట్టుగా నిర్ధారించారు. ఆయన మృతితో తంగేడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ, మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు, లక్ష్మీనరసింహరాజు ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

పకడ్బందీగా నిర్వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్

యలమంచిలి(అనకాపల్లి రూరల్): ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ బొదెపు గోవింద్ సూచించారు. పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఒకరోజు వలంటీర్ల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. వచ్చే నెలలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వలంటీర్లు క్రీడలకు సంబంధించిన నియమ నిబంధనలను తెలుసుకుని ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా సచివాలయాల పరిధిలో పోటీలను నిర్వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడలకు సంబంధించి నియమ నిబంధనలను ఎంఈవో-2 అరుణ్ కుమార్ వలంటీర్లకు వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి టి.చాముండేశ్వర్రావు, ఎంపీడీవో అప్పలనాయుడు, పీఈటీలు వెంకట్రావు, షబ్బీర్, సూర్యప్రకాష్, మూర్తి, అప్పలరాజు, ఇందిర, సూర్యప్రభ, మహాలక్ష్మి, సుసర్ల సూర్య ప్రకాష్, గ్రామానికి 10 మంది చొప్పున పట్టణం, మండలంలోని వార్డులు ,గ్రామాల నుంచి వలంటీర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టండి...



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

నక్కపల్లి : బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దార్ అంబేద్కర్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. పెళ్లి వయస్సు రాకుండా వివాహాలు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశముందని, చట్టాన్ని అతిక్రమించి బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కేసులు నమోదు చేసే అవకాశముందని తెలిపారు. బాల్య వివాహాలకు సిద్ధపడిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని, దీనిపై ప్రజలను చైతన్య పరిచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కైలాష్ సత్యార్థి సీడ్ సంస్థలను ఎంపిక చేసిందన్నారు. మండల, గ్రామస్థాయి కమిటీలను ఎంపిక చేయాల్సి ఉందని సీడ్ సంస్థ కార్యదర్శి వి.సన్యాసిరాజు తెలిపారు. వీఆర్వో, కార్యదర్శి సర్పంచ్, ఎంపీటీసీ, అంగన్‌వాడీ , ఏఎన్ఎం, మహిళా పోలీసులతో గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు వద్దంటూ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల పరిషత్ ఏవో సీతారామరాజు, సీడీపీవో శ్రీవిద్య పాల్గొన్నారు.

బాలలకు సృజనాత్మక క్రీడలు



మిక్కీమౌస్ క్రీడలో పాల్గొన్న విద్యార్థులు

ఎస్.రాయవరం : ఆటపాటలతో విద్యాబోధన చేస్తే విద్యార్థుల్లో మరింత ఆసక్తి కరంగా నేర్చుకుంటున్నారని వమ్మవరం మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు అన్నారు. శనివారం పాఠశాలలో నో బ్యాగ్ డే సందర్భంగా మిక్కీ మౌస్ క్రీడ ఆడించి అలరింపజేశారు. ప్రతి నెలా మూడో శనివారం నోబ్యాగ్ డే సందర్భంగా పలు సృజనాత్మక క్రీడలు నేర్పిస్తు విద్యార్థులకు ఆసక్తి కలిగే విధంగా చేస్తున్నామన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరావు

మునగపాక : మునగపాకను కరువు మండలంగా ప్రకటించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టిక్కలి వెంకటరావు కోరారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా వర్షాలు లేక పంటపొలాలు ఎండిపోతున్నాయని దీంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి బైపాస్ రోడ్డు వరకు శిథిలావస్థకు గురైన రోడ్డును బాగు చేయాలని కోరారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమిటీల నియామకం జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు కూండ్రపు అప్పారావు, తనకాల అనంతరావు, బోడపల్లి సుభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో పలు అభివృద్ధి పనులు

మునగపాక : ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. తోటాడ సచివాలయంలో శనివారం జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామసభలో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో ఈ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పథకంలో చేరే కూలీలకు జాబ్‌కార్డులు అందజేస్తామన్నారు. ఏపీవో ఎరకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కోటవురట్ల గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు



చిన్నదొడ్డిగల్లులో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



దిమిలిలో పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



యోగాపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

యలమంచిలి : స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శాఖ గ్రంథాలయ అధికారి ఆనంద్ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. డ్రగ్స్ యువతపై ప్రభావం-పరిష్కార మార్గాలు అనే అంశంపై డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

కోటవురట్ల : గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు 'మత్తు పదార్థాలు-యువతపై వాటి ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'గ్రంథాలయాలు- వాటి ప్రయోజనాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయం బోదిగాలం పాఠశాలలో విద్యార్థులకు గ్రంథాలయాలు-టీవీలు, సెల్‌ఫోన్ల ఉపయోగం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి కె.జనార్దన్, తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.వి.ఎస్.ఆచార్యులు తెలిపారు.

దిమిలి గ్రంథాలయంలో పాటల పోటీలు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ పాటల పోటీలు నిర్వహించినట్టు లైబ్రేరియన్ ఎస్. శకుంతల తెలిపారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు శకుంతల తెలిపారు. ఈ కార్యక్రమంలో శానాపతి అప్పారావు, గల్లా నూకినాయుడు, సుందరపు మధు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

అచ్యుతాపురం(అనకాపల్లి): గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ

పాయకరావుపేట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. యోగా గురువు ప్రసాదరావు విద్యార్థులకు యోగాభ్యాసం, యోగా చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యోగా వల్ల ఉప యోగాలను వివరించారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, విశ్రాంత ఉపాధ్యాయులు, పాఠకులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సనాతన రుషి సంస్కృతిని కాపాడుకోవాలి



హిందూ సమ్మేళనంలో పాల్గొన్న ఆచార్యులు, సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): భారతదేశ సనాతన రుషి సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని శ్రీఅష్టలక్ష్మి పీఠం శ్రీ రఘునాథ ఆచార్య స్వామి అన్నారు. అచ్యుతాపురంలో శనివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మేళనంలో రఘునాథ ఆచార్య మాట్లాడుతూ రామనామం గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా భజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ కూండ్రపు విమలనాయుడు, ఎంపీటీసీ ద్వారపురెడ్డి బాబ్జి, ఆడారి గంగాధర్, కొల్లి అప్పారావు, కాళ్ల నూకినాయుడు, భీశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత వాడ్రాపల్లి జట్టు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కశింకోట: జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మునగపాక మండలం వాడ్రాపల్లి జట్టు ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకుంది. నాగుల చవితిని పురస్కరించుకుని స్థానిక కనకమహాలక్ష్మి వీధిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా శుక్రవారం రాత్రి జరిగాయి. ఫైనల్ పోటీల్లో వాడ్రాపల్లి, కశింకోట దుర్గమాంబ జట్లు తలపడ్డాయి. వాడ్రాపల్లి ప్రథమ స్థానంలో నిలవగా, దుర్గమాంబ జట్టు ద్వితీయ స్థానం పొందింది. బుచ్చియ్యపేట మండలం రాజాం జట్టుకు తృతీయ స్థానం లభించింది. ఈ మేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ. 8,116, 4,116, 2,116 చొప్పున అందజేశారు. కనకమహాలక్ష్మి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, కోశాధికారి ఆళ్ల శ్రీను ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, కృష్ణం రాజు కాలువ మాజీ డైరెక్టర్ మళ్ల లోవకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.